# సద్గురు బోధలో జగద్గురు గీత

రచన : కూరెళ్ళ కోదండరామం

సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్
Regd. 192/2019



# సద్గురు బోధలో జగద్గురు గీత

## మొదటి అధ్యాయం

1.హేమాడ్ పంతు వారి శ్రీ సాయిసత్చరిత్ర గ్రంథము ప్రధమ అధ్యాయం లో బాబా వారు మనకి తిరుగలిని గూర్చిన కధలో తిరుగలి యొక్క క్రిందిరాయి కర్మ; మీదిరాయి భక్తి; చేతిలో పట్టుకొనిన పిడి జ్ఞానము అని తెలియచేసి, జ్ఞానోదయమునకు గాని, ఆత్మసాక్షాత్కారమునకు గాని మొట్టమొదట పాపములను, కోరికలను తుడిచి వేయాలని బోధించారు. అదే త్రిగుణరాహిత్యమునకు దారి తీస్తుంది అని చెప్పారు.

త్రిగుణ రాహిత్యం గురించి అంతలా బాబా వారే కాదు, భగవద్గీతలో శ్రీకృష్ణుల వారు కూడా ముందు ముందు అధ్యాయాల లోనే చెప్పారు.

ముందుగా ఈ త్రిగుణాలతో మనకి వచ్చే తంటా ఏమిటో చూద్దాం. సూక్ష్మంగా చెప్పాలంటే మనం ఈజన్మ తీసుకున్నాం అన్నా, ఇంత మంచి గురు మార్గంలో సాగడానికి అభ్యసిస్తున్నాం అన్న దానికి కారణం ఈ త్రిగుణాలే. ఈ త్రిగుణాల గురించి తెలుసుకునే ముందు జీవాత్మ – పరమాత్మల గురించి తెలుసుకోవాలి.

ఆత్మ పరమాత్మ అంశ అని అందరికీ తెలుసు. ఈ ఆత్మ తన ప్రారబ్ధకర్మని భోగించడానికి కారణ శరీరాన్ని పొంది జన్మని పొందినప్పుడు జీవాత్మ గా నుడువబడుతోంది, ఇక్కడి దాక ఆత్మ-పరమాత్మ-జీవాత్మ లకు ఏ భేదం లేదు.

అయితే ఎప్పుడైతే ఈ జీవాత్మ ప్రకృతిలో ఉన్నత్రిగుణాలతో తాదాత్మ్యం చెంది, వాట్లతో చేతులు కలిపి, త్రిగుణాల పరంగా సాధారణంగా ప్రక్రుతి లోభావంతో జరిగిపోయే కర్మలను కూడా తానె చేస్తున్న అన్న అహంభావం లో పడి, కర్త్రుత్వాన్ని తనపై ఆరోపించుకుంకుంటుందొ అప్పుడు ఆ జీవి తో (జీవాత్మ తో కాదు) చేయబడ్డ కర్మల పాప-పుణ్య ఫలితాలు పొంది , వాట్లను అనుభవించడానికి మళ్ళీ జన్మ తీసుకుంటుంది.

చూశారా ఈ త్రిగుణాలు ఎంతలా మనని బందిస్తాయో. ఇదే విషయాన్ని అందరికీ అర్ధం అయ్యే రీతిలో మనకి బాబా వారు ఈ తిరగలి కధలో బోధించారు. ఇదే విషయం శ్రీమద్భగవద్గీత అ.3 శ్లో.27 లో శ్రీకృష్ణుల వారి పదాల్లో చూడండి.

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।
అహంకారవిమూఢాత్మా కర్తాఽహమితి మన్యతే ।। 3-27 ।।

వాస్తవముగా కర్మలన్నియును అన్ని విధముల ప్రకృతి గుణముల ద్వారానే చేయబడుచుండును. అహంకార విమూఢాత్ముడు ఈ కర్మలకు నేనే కర్తను అని భావింపుచుచున్నాడు" (అ.3 శ్లో.27).

ఈ జగత్తు లో మన చేత గాని, అన్యులచేత గాని లేదా పరిస్థితుల ద్వారా గాని జరిగే పనులన్ని సత్వ-రజస్- తమో గుణాలలో ఏదో గుణ ప్రకోపం వల్లే జరుగుతూ ఉంటాయి.
మన దేహం తయారయింది ఈ మూడు గుణాల మేళవిక తోనే. మనలో ప్రతీ క్షణం జరిగే ఈ మధనం లో ఈ మూడు గుణాలలో ఏదో ఒక గుణం ఎక్కువ

ప్రభావితం గా ఉంటూ మిగిలిన రెండు గుణాలని అణచి పెట్టి ప్రకోపిస్తూ ఉంటుంది. ఏ గుణం మనలో ఎక్కువగా ప్రకోపిస్తూ ఉంటుంది అనేది మనం తిన్న ఆహారం, పరిసరాలు, చదివే పుస్తకాలు, చూసే సాహిత్యాలు, అలవాట్లు, సత్సంగాత్యం మొదలైన విషయాల మీద ఆధార పడి ఉంటుంది.

కాపోతే ఏ గుణం ప్రకోపించి ఉందో ఆసమయం లో బయట పడే దాని ప్రతాపం అలాగే ఉంటుంది. అలా మనది అనబడే ఆత్మతో ఎటువంటి సంబంధం లేకుండా, జరుపబడుతున్న పనుల్లో మనం దూరి, ఆ జరుగుతున్న దంతా మన వల్లే జరుగుతోంది, నేనే చేస్తున్నా అన్న భావనతో ఉండి, ఆ మూడుగుణాల వల్ల జరిగిన పనిని కూడా మన నెత్తి మీద వేసుకుని, మనం చేస్తున్నాం అన్న భావనకి పోయి, ఆ కార్యం ద్వారా బయల్పడే పుణ్య, పాప ఫలాలను మనఖాతాలో వేసుకుంటుఁన్నాము.

దేనివల్ల అంటే అహంకారంవల్ల. అంతా నేనే చేశాను. అన్నిటికి నేనే నియామకుడిని - అని భావించే అజ్ఞానం.
మనకు మానసిక శాంతి లభించాలన్న, ఆధ్యాత్మ ప్రగతి కావాలన్న, ఇంట్లో ఆనందం వెల్లి విరియాలన్న, అందరూ మిమ్మల్ని మెచ్చుకోవాలి అనుకున్న, అందరూ మిమ్మల్ని మన వాడు అనుకోవాలి అనుకున్న, శాంతిగా జీవనం గడపాలి అనుకున్న, ముఖ్యంగా వదలాల్సింది ఈ అహం భావననే.

నేను, నాది, నా ఆస్థి, నా పరువు, నా అంతస్థు, నా ఉద్యోగం, నా జీతం, నా ఆధీనం, నా అధికారం, నా గొప్పతనం మొదలైన భావాలు మనం ఎన్ని సార్లు

నా.. నా..నా.నా. అనుకుంటూ ఉన్నామో అంతకు పదిరెట్లు మనల్ని కర్మ బంధం లో కి నెడతాయి.

దాని బదులు పోతన గారు 'అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూల పుటమ్మ చాల పెద్దమ్మ' అంటూ అమ్మ. అమ్మ. అమ్మ. అమ్మ అంటూ పలికి ఎలా తనని తాను ఉద్ధరించుకున్నారో గ్రహించి మనం కూడా సాయి నామాన్నో, ఓం కారాన్నో, రామ నామాన్నో, కృష్ణ నామాన్నో, శివ నామాన్నో నా అనాల్సి వచ్చినప్పుడల్లా దృష్టి సారించి , దాన్ని నియంత్రించి , ఒక సాధన గా దాన్నించి దూరంగా ఉంచగలమేమో ప్రయత్నించండి.
దానితో మన జీవన గతి ఈభగవంతునితో అనుసంధానం అయి ముక్తి మార్గం వైపు తిరుగుతుంది.

ఇంతటి ప్రమా(మో)ద కారులైన ఈ త్రిగుణాల ప్రభావం నించి మనల్ని దూరం చేయడానికి బాబా వారు మనల్ని సద్గురు మార్గం లో నడిచి తరించమని బోధించారు. గీతలో శ్రీకృష్ణుల వారు కూడా ఈ అహాన్ని వీడి, శరణాగతి చేయమనే బోధించారు.. అందుకు ఆ సద్గురు పాదాలనే ఆశ్రయిద్దాం రండి.

2.ఎందరో మహానుభావులు. అందరికీ వందనాలు అంటూ ఎన్నో తరాలలో ఉన్న మనం చూసిన, చూడని ఎందరినో ఒక్క మాటలో శ్లాఘించాడు త్యాగయ్య. ఈరోజు మనం సాయి చరిత్ర చదువుతున్నాం అంటే అందుకు హేమాడ్ పంతు చలవే అని మనం గుర్తు పెట్టుకోవాలి. ఒక పోతన, తులసీదాస్, కబీర్, నారాయణ భట్టతిరి ఇత్యాది మహానుభావులు సంసార బాధల్నించి తరింపచేసే మహా కృతులను ఎలా చేయగలిగారో అర్థం చేసుకుందాం.

హేమాడ్ పంతు  ఒక సమయంలో సాయి చరిత్రను వ్రాయడానికి తనకు తగిన సమర్ధత లేదని భయపడ్డాడు. తను ఉన్న లౌకిక స్థితిలో ఒక యోగీశ్వరుని చరిత్రను ఎలా వ్రాయగలను అని అనుకున్నాడు. అయితే బాబా వారి బోధలు ఇహపరములకు కావలసిన జ్ఞానాన్ని, బుద్ధిని ఇస్తాయి. వేదాలలాగా, జనరంజకంగా ఉపదేశాలైన బాబా ప్రభోదాలు విని, వాటిని మననం చేస్తే భక్తులు కోరినవి, అంటే బ్రహ్మైక్య యోగం, అష్టాంగయోగ ప్రావీణ్యము, ధ్యానానందం పొందుతారు అని నమ్మాడు.

ఇలాంటి సంకల్పాలు మనలో ఎందరమో చేస్తాము. దాంతో మన బాధ్యత ఐపోయిందా? కాదు. మరి హేమాడ్ పంతు ఏం చేశాడు?

తన అహంకారాన్ని బాబా పాదాలపై ఉంచి శరణు కోరాడు. దాంతో ఎందరో జీవులకు ధన్యతనొసగే సాయి సత్ చరిత్రని అందించాడు.  ఇది ఒక విధంగా సాయి బాబా శరణాగతి విలువ ని మనకి బోధించినట్లే కదూ.

ఇక్కడ మనం అర్జునుల వారు యుద్ధం చేసి తన బంధువులని చంపి రాజ్యాన్ని సాధించి భోగించడమా; లేదా యుద్ధం నించి విరమించుకుని వారి చేతులలోనే ప్రాణ త్యాగం చేయాలా అన్న (అ)ధర్మ మీమాంస లో ఉన్నప్పుడు  అంతర్యామి అయిన కృష్ణుడు ఆయనతో పలికించిన భావం, ఇక్కడ హేమాడ్  పంతు లో అంతర్యామిగా ఉంటూ సాయి బాబా ప్రేరేపించిన పైనం ఒకటో కాదో చూద్దాం.

భగవద్గీత అ.2 శ్లో.7 లో అర్జునుల వారు ఇలా అంటారు.

కార్పణ్యదోషో పహతస్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మ సమ్మూఢచేతాః ।
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥

నా కర్తవ్యం ఏమిటో నాకు తెలియటంలేదు మరియు ఆందోళన, పిరికితనము నన్ను ఆవహించాయి. నేను నీ శిష్యుడను, నీకు శరణాగతుడను. నాకు నిజముగా ఏది శేయస్కరమో దానిని ఉపదేశించుము.

వివరంగా చెప్పాలంటే  ఎటూ తేల్చుకోలేని దోష స్వభావంతో పూర్తిగా నిండిన మానసిక స్థితిలో ఉన్న నేను నిన్ను అభ్యర్దిస్తున్నాను. (ఉన్న పరిస్థితిని భేరీజు వేసి) ఏది నాకు శ్రేయస్కరం అని నీకు అనిపిస్తుందో.. అది చెయ్యి అని నన్ను ఒక శిష్యుడికి (గురువు ఆదేశించినట్లు) ఆదేశించు అని అర్జునుల వారు శ్రీకృష్ణుడిని అర్థించారు.

.

ఈ శ్లోకం భగవద్గీతలో చాలా కీలకం . ఇక్కడ అర్జునుల వారు (1) తమ దోష పూరిత మనో క్లేశాన్ని ఎటువంటి బిడియం లేకుండా ఒప్పేసుకున్నారు. (2) తెలీనిది తెలీదు అని ఒప్పేసుకున్నారు. (3) అహంని పూర్తిగా వదలిపేశారు. (4) తను ఎటూ తేల్చుకోలేక పొతూన్నాను అని (4) అందువల్ల తనని ఒక శిష్యుడిగా భావించి (5) ఇది చేస్తే అలా ఉంటుంది .. అది చేస్తే ఇలా ఉంటుంది అన్న ఆప్షన్స్ ఇవ్వకుండా (5) తనకి ఏది శ్రేయస్కరం అని శ్రీకృష్ణుల వారికి అనిపిస్తుందో (6) దానిని ఆయనే నిర్ణయించి (7) తనని ఎలా చెయ్యి అని ఆదేశించమని (8) శ్రీకృష్ణుల వారిని అర్థించారు

(9). ఇది కంప్లీట్ సరెండర్ అంటే. అంటే పూర్తి శరణాగతి. అహం పూర్తిగా వదలిపేశి నేను ఏది చేస్తే నాకు శ్రేయస్కరం అని నీకు అనిపిస్తే నన్ను అది చెయ్యి అని అదేశించు. దానిలో మనం మన రియాక్షన్స్, మన ఆలోచనలు, మన తెలివి తేటలు, మన విద్య, మన అవిద్య, మన అహం, మన అనుభవం, మన బంధాలు, మన కోరికలు, మన అవసరాలు, మన పదజాలాలు, మన వేష భాషలు, మన వేదాంతం, మన వారి ప్రేరణలు, మన ఆశా నిరాశలు అన్నిటిని పక్కన పెట్టి ఆయన ముందు మోకరిల్లడం.

దీనినే empty cup ప్రాక్టీసు అంటారు. నీరు నిండుగా ఉన్న గ్లాస్ లో మీరు ఎంత పోసినా అది గ్లాస్ నిండి బయటకు పోతుంది గాని దేనికీ పనికిరాదు. అదే మన ఆలోచనల్ని .. అహాన్ని బయటకి పారద్రోలి మన మైండ్ టోటల్ ఫ్రీ గా ఉంచి భగవంతుడి ముందు మోకరిల్లిన నాడు మన దైనందిన జీవితం లో కూడా మార్గదర్శిగా ఉండి మనల్ని ముందుకి తీసుకెళ్ళడానికి భగవంతుడు ఎప్పుడూ ఎదురుచూస్తూ ఉంటాడు.

అలా శరణాగతి కోరిన అర్జునుడిని భారత యుద్ధం లోనూ, ఇక్కడ హేమాడ్ పంతును సరైన మార్గంలో నడిపి శరణాగతి ప్రాశస్త్యాన్ని అనుష్టాన పరంగా మనకు బోధించారు సద్గురువు మరియు జగద్గురువు. మరి మన అహాన్ని పక్కనపెట్టి శరణు కోరదామా!.

3.సాయినాథుడు నిర్దేశించిన మార్గంలో సాగేందుకు ప్రయత్నిస్తున్న సాధకులకు వందనం. మనం ఒక్కసారి హేమాడ్ పంతు సాయి చరిత్రని వ్రాసే

ముందు  ఎంత తర్జన భర్జన పడ్డారో చూద్దామా. వారు ఇలా అనుకున్నారుట. "ఒక యోగీశ్వరుని చరిత్రను నేను ఎలా వ్రాయగలను? అవతార పురుషుల లక్షణములు ఎలా వర్ణించగలను? వేదములే వారిని పొగడలేవు. ఒక యోగి తాను యోగి అయినా గానీ వేరే  యోగి యొక్క జీవితమును గ్రహింప లేడు. అలాంటి వారి మహిమలను నేను ఎలా కీర్తించగలను? సప్తసముద్రాల లోతును కొలవ వచ్చు, ఆకాశమును గుడ్డలో వేసి మూయ వచ్చును, కానీ యోగీశ్వరుని చరిత్ర వ్రాయటం చాలా కష్టం"  అనుకున్నారుట.

అయితే "మూకం కరోతి వాచాలం. పంగుం లంఘయతే గిరిం"  అన్నట్లు స్వామి కృపతో ఏదైనా సాధ్యమే అని ఈ గ్రంథం చూస్తేనే మనకి అర్థం అవుతుంది. ఇంతకీ సాయి అతనిలో అసలు ఈ సచ్చరిత్ర రాయాలన్న ఆకాంక్షని, అందుకు ప్రజ్ఞని ఎందుకు ఇచ్చారో చూద్దామా.

మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే |
శ్రద్ధయా పరాయోపేతాస్తే మే యుక్తతమా మతాః || గీత 12 - 2 |

శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణుల వారు అంటున్నారు - నా పైనే తమ మనస్సులను లగ్నం చేసి మరియు సతతమూ నా పట్ల దృఢ విశ్వాసంతో భక్తి లో నిమగ్నమైన వారు అత్యుత్తమ యోగులని నేను పరిగణిస్తాను.

అలా హేమాడ్ పంతు జన్మ జన్మల సంస్కారాన్ని ఎరుగును కాబట్టే ఆయనకు ఇంత గొప్ప సచ్చరిత్ర ను వ్రాసే అవకాశం ఇచ్చారు మన బాబా.

అలాగే గీత అ.18 శ్లో.61 ఇంకా ఇలా పేర్కొంది.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ।।

ఈశ్వరుడు సర్వ భూతముల హృదయములలో కూర్చుని ఉన్నాడు. వారి వారి కర్మలను అనుసరించి, భౌతిక శక్తితో చేయబడిన ఈ యంత్రాలలో ఉన్న ఆయా జీవుల (జీవాత్మల), పరిభ్రమణను నియంత్రిస్తాడు."

అంటే ఆయన మనలోనే అంతర్యామిగా ఉంటూ మనసా, వాచా, కర్మణా మనం చేసే ప్రతి సంకల్పాన్ని, కార్యాన్ని చూస్తూ, సరియైన సమయములో వాటి ఫలాలను అందచేస్తాడు. ఇలా అనంత కోటి జన్మలలో మనం ఎక్కడికి వెళ్లినా, భగవంతుడు మనతో పాటే ఉంటాడు.

మరి అంతటి కృప సాధించ డానికి మనం ఎలా ఉండాలో కూడా గీతాచార్యుడే మనకి ఇలా చెప్పాడు.

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।
నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ।। అ 12 - 13

సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్తః స మే ప్రియాః ।। అ 12 - 14

ఏ భక్తులైతే, సమస్త ప్రాణుల పట్ల ద్వేషభావన లేకుండా, మైత్రితో/స్నేహపూరితముగా, కారుణ్యముతో ఉంటారో, వారు నాకు చాలా ప్రియమైన వారు. వారు ఆస్తి/ధనము పై మమకార/ఆసక్తి రహితముగా ఉంటారు మరియు అహంకారము లేకుండా, సుఖ-దుఃఖముల రెండింటి యందు ఒకే విధంగా ఉంటారు మరియు సర్వదా క్షమించే మనస్సుతో ఉంటారు. వారు ఎల్లప్పుడూ తృప్తితో, భక్తితో నాతోనే ఏకమై, ఆత్మ-నిగ్రహంతో, ధృఢ సంకల్పంతో మరియు మనోబుద్ధులను నాకే అర్పించి ఉంటారు.

ఒక భక్తుడికి పై లక్షణాలే భూషణాలు గాని, పై పై అలంకారాలు కావని శ్రీకృష్ణుడు బోధించగా, షిర్డీ బాబా అలా ఉన్న భక్తులను తరింప చేసి చూపించారు. సరే మరి ఇన్ని సులక్షణాలను పొందిన భక్తులు ఏమి ఆశిస్తారో చూద్దామా.

మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్ ।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ।। అ.10 - 9 ।।

శ్రీకృష్ణుల వారు అంటున్నారు - అటువంటి భక్తులు వారి మనస్సులు నా యందే లగ్నం చేసి, వారి జీవితాలని శరణాగతితో నాకే అర్పించి, నా భక్తులు ఎల్లప్పుడూ నా యందే సంతుష్టులై ఉంటారు. ఒకరినొకరు నా గురించి తెలుపుకుంటూ మరియు నా వైభవాల గురించి చర్చించుకుంటూ అత్యంత తృప్తిని, పరమానందమునూ అనుభవిస్తుంటారు.

చూశారా హేమాడ్ పంతు ఎంతటి ఉన్నత పదాన్ని కరతలామలకం చేసుకున్నాడో. ఇందుకు ఆయన చేసింది అనన్య భక్తి, శరణాగతి. మరి ఆ వైపు మన మనసుని తిప్పుదామా.

4.సర్వం శ్రీసాయి

హేమాడ్ పంతు సాయి చరిత్ర రాయాలని సంకల్పించి, ఆ విషయం లో బాబా ముఖ్య భక్తుడు అయిన మాధవరావు దేశపాండే ఉరఫ్ శ్యామా అనే వానిని తన తరపున బాబాను ప్రార్థించాలని కోరాడు. అతని నివేదన విని, బాబావారు హేమాడ్ పంతు కు ఊదీ ప్రసాదము ఇచ్చి "అహంకారం వదలిన నాడు నీ మనస్సులో ప్రవేశించి నా చరిత్రను నేనే వ్రాసుకుంటాను. నా కథలు, బోధనలు విన్న భక్తులకు భక్తి విశ్వాసములు చేకూరి, ఆత్మ సాక్ష్యాత్కారము, బ్రహ్మానందం పొందుతారు" అని చెప్పారు.

ఆ తరువాత బాబా వారు చెప్పింది సాధకులకు చాల ముఖ్యం అయినది. "నీకు తోచిన దానినే నీవు నిర్ధారణ చేయడానికి ప్రయత్నించకు. ఇతరుల అభిప్రాయాలను కొట్టివేయడానికి ప్రయత్నించకు. ఏ విషయంపైనైనా కీడు, మేలు ఎంచుకోవడంలో వివాదాలు కూడదు'' అన్నారు.

ఈ మాటల్లో ఎంతో పరమార్థం కూడుకుని ఉంది. ఈ విషయంలో భగవద్గీత అ.3 లోని శ్లోకాలు చూద్దాం.

కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః ।

లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి ।। 20 ।।

యద్యదాచరతి శ్రేష్ఠః తత్త దేవేతరో జనః ।

స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ।। 21 ।।

తమ సహజమైన, స్వధర్మాన్ని నిర్వర్తించటం ద్వారానే, జనక మహారాజు వంటి వారు సిద్ధిని పొందారు. ప్రపంచానికి ఒక చక్కటి ఆదర్శం చూపటానికి నీవు కూడా నీ కర్తవ్య నిర్వహణ చేయాలి. గొప్పవారు చేసే పనులను సామాన్య జనులు అనుకరిస్తారు. వారు నెలకొల్పిన ప్రమాణాన్నే, ప్రపంచమంతా అనుసరిస్తారు.

ఎప్పుడైతే సత్ప్రవర్తన కలిగిన నాయకులు ముందుంటారో, సహజంగానే మిగతా సమాజం కూడా నీతిప్రవర్తన, నిస్వార్థం మరియు ఆధ్యాత్మిక బలం లో పుంజుకుంటారు. హేమాడ్ పంతు అలాంటి వ్యక్తిత్వం కలవాడవడం వల్లే తన కథను వారిచే వ్రాయిచుకున్నారు. అయితే ప్రజ్ఞ, గురువు, ఆచార్యుడు ఇత్యాది స్థానాలు అనుకోకుండా అత్యున్నత వ్యక్తిలో కూడా ఒక అహంభావాన్ని, నేనే సాధించానన్న గర్వాన్ని తెచ్చి, తాను అందరినీ ఒకే త్రాటిపై నడిపించగలను అన్న భ్రాంతికి లోను చేసే అవకాశం ఉంది.

అది దూరంగా పెట్టడానికని బాబా వారు "నీకు తోచిన దానినే నీవు నిర్ధారణ చేయడానికి ప్రయత్నించకు. ఇతరుల అభిప్రాయాలను కొట్టివేయడానికి ప్రయత్నించకు" అన్నారు. అందరికీ అర్థం అయ్యేలా బాబా బోధించిన ఈ మాటను గీతాచార్యుని మాటల్లో చూద్దామా:

న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసంగినామ్ ।

జోషయేత్ సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్ ।। 26 ।।

(కర్మలను ఫలాసక్తిలేకుండా చేసినా) ఫలాసక్తి తో కర్మలను చేసే అజ్ఞానుల బుద్ధిని (సామాన్యుల బుద్ధిని) నీలాంటి జ్ఞానులు భ్రమకు గురిచేయరాదు. అంతేకాక, జ్ఞానోదయ స్థితిలో తమ విధులను నిర్వర్తిస్తూ, అజ్ఞానులకు కూడా విహిత కర్మలను చేయటానికి స్ఫూర్తినివ్వాలి. అలాగే మనకు విషయం తెలుసుకదా అని అజ్ఞానులకి (సామాన్య జనులకు) అర్థం కాని ఉన్నత స్థాయి ఉపదేశం చెప్తూ, వారిని భ్రమకు గురి చేయరాదు.

ఉపనిషత్తుల సారంగా భాసిస్తున్న భగవద్గీత లోని విషయాలను కథలుగా, బోధలుగా, ఆచరణ లోనూ, తన భక్తులతో మాటల లోనూ తెలియచేసి, వారిని ఎటువంటి భ్రమకు గురి చేయకుండా, అలాగే వెనక్కి వెళ్లి ఏదో గ్రంథం తిరగేసి విషయం ఏమిటో తెలుసుకోవాలి అన్న ప్రయత్నం చేసే అవసరం లేకుండా, సాక్షాత్తు శ్రీకృష్ణుల వారు నుడివిన సూత్రాన్నే బాబా వారు ఆచరణ లో చూపారు కదా.

అంతేకాక గీతాచార్యుడు ఉపదేశించినట్లుగా (జ్ఞానోదయ స్థితిలో తమ విధులను నిర్వర్తిస్తూ, అజ్ఞానులకు కూడా విహిత కర్మలను చేయటానికి స్ఫూర్తినివ్వవలెను) జ్ఞాన భాండాగారం అయిన మన బాబా పైకి మాత్రం చాలా సాదాసీదాగా ఉంటూ, కేవలం తమ నడవడిక, మాట, ప్రేమ ద్వారా ఎందరికో సద్గురువుగా భాసిస్తున్నారు. అటువంటి సద్గురు పాదాలను మన చిత్తం లో నిలపమని ప్రార్థిద్దామా.

సర్వం శ్రీసాయి

5.బాబా వారి బోధలలో భక్తియోగం, ఆత్మ తత్త్వం మిళితమై, అందరికి ఆచరణ యోగ్యం గా ఉంటుంది. భగవంతుడు అంతటా ఉన్నాడని, అందరిలోనూ ఉన్నాడని వారు బోధించారు. ఈ లోకంలో భోగాలు శాశ్వతం కావని, మోక్షమే శాశ్వతమని బోధించారు. అలాగే మనకి ప్రాప్తించే ఏ స్థితి అయిన అది కేవలం పూర్వపు కర్మల కారణంగానే అని గ్రహించాలని సూచించారు.

ఈ మూడు విషయాలు భగవద్గీత లో ఏ తీరుగ చెప్పబడ్డాయో చూద్దాం. ముందుగా అ 10 నుంచి.

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః |
అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ ||

శ్రీకృష్ణుల వారు అంటున్నారు - ఓ అర్జునా, నేను సర్వ భూతముల హృదయములలో కూర్చుని ఉన్నాను. నేనే సర్వ ప్రాణుల ఆది, మధ్యము మరియు అంత్యము.

ఇదే విషయాన్ని భాగవతం "హరిర్హి సాక్షాద్భగవాన్ అంశరీరిణామాత్మా" అన్న పదాల్లో "భగవంతుడు సర్వ ప్రాణుల ఆత్మ కు ఆత్మ అని అంటోంది. అసలు భగవంతుడికి భక్తుడికి ఉన్న సంబంధం తైత్తరీయ ఉపనిషత్తు ప్రకారం "ఎవని నుండి సర్వ ప్రాణులు ఉద్భవించాయో వాడే భగవంతుడు; ఎవని

యందు సర్వ ప్రాణులు ఆధారపడి స్థితమై ఉన్నాయో వాడే భగవంతుడు; ఎవని లోనికి సర్వ ప్రాణులు ఏకమై పోతాయో వాడే భగవంతుడు.

ఇక ఈ లోకంలోని భోగాలు, వాటి అశాశ్వతం విషయం లో గీతలోని అ.8 శ్లో.15చూద్దాం.

మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్ ।
నాప్నువంతి మహాత్మానః సంసిద్ధిమ్ పరమాం గతాః ।।

నన్ను పొందిన పిదప, మహాత్ములకు, ఈ దుఃఖముల నిలయము మరియు తాత్కాలికము అయిన ఈ లోకంలో పునర్జన్మ ఉండదు.
ఈ లోకం లో బాధలేమిటి అంటారా?

పుట్టేటప్పుడు, నిస్సహాయ స్థితిలో ఏడుస్తూ ఎంతో బాధ అనుభవిస్తాము. తదుపరి పసి బిడ్డలుగా, మనకున్న అవసరాలను మనం వ్యక్త పరచలేకుండా ఉండి, ఏడుస్తాము. యుక్తవయస్సులో శారీరిక అవసరాల కోసం తంటాలుపడాల్సి వస్తుంది, దీనితో మానసిక క్షోభ అనుభవిస్తాము. వైవాహిక జీవితంలో దాంపత్య భాగస్వామి యొక్క విలక్షణస్వభావాలని భరించాలి. ముసలితనం చేరుకున్నప్పుడు, శారీరిక దౌర్భల్యములను అనుభవించాలి.

జీవితం మొత్తం - మన స్వంత శరీరము - మనస్సుల నుండి జనించే బాధలు, ఇతరుల ప్రవర్తన, ప్రతికూల పరిస్థితుల - నుండి జనించే కష్టాలను

అనుభవించాలి. చివరికి, మన మృత్యు కాలంలో పడే యాతన ని కూడా అనుభవించాలి. ఇవి చాలవా?

మరి ఇన్ని సూచించిన బాబా వారు మనకి ముక్తి భార్గాన్ని బోధిస్తూ, అసలు ఆ ముక్తి కన్న ఆరాటం కూడా పూర్వ జన్మ కారణంగానే అని వివరించారు. ఇక శంకర భగవత్పాదులైతే కూడా "జ్ఞానం వినా మోక్షో న సిద్ధ్యతి" అన్న పదాల్లో "గురు బోధ అనే ఆత్మ జ్ఞానం ఒక్కటే మోక్షానికి ఉత్తమ సాధనం" అని సూచించారు.

ఇక్కడ గ్రహించాల్సింది ఏమిటంటే ఆత్మజ్ఞానం అన్నది ఎన్నో జన్మల సాధన వల్లనగాని అబ్బదు అది గ్రంధాలు తిరగేస్తేనో, మరేదో స్వప్రయత్నం తోనో రాదు. సద్గురువు, సత్సంగం, సద్గ్రంధం తోడైననాడు, ఆ భగవంతుడికి చూపు మన పై బడి, ముక్తి కరతలామలకం అవుతుంది. ఎందుకంటే పై సాధనల ద్వారా మనస్సుని, శరీరాన్ని శుద్ధి చేసుకొన్న వారికి పాపాలు క్షీణిస్తాయి. వాసనా క్షయం జరుగుతుంది. పూర్వ జన్మ వాసనలు క్రమేపీ తొలగుతాయి. అందువల్ల వచ్చే లాభం ఏమితో గీత లోని అ 17 శ్లో 3 లో చూద్దాం.

సత్త్వానురూపా సర్వస్య
శ్రద్ధా భవతి భారత ।
శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవ సః ॥

అందరు మనుష్యులు తమ మనస్సు యొక్క స్వభావమునకు తగ్గట్టుగా శ్రద్ధావిశ్వాసములను కలిగి ఉంటారు. అందరికీ శ్రద్ధావిశ్వాసములు ఉంటాయి, మరియు వారి విశ్వాసము ఎట్టిదో అదే వారి వ్యక్తిత్వము గా ఉంటుంది.

ఈ విశ్వాసం, గురు కృప అనేవి జన్మ జన్మల అభ్యాసంతో, భగవంతుడి పై ఉండే అనన్య భక్తీ తోనే సాధ్యమౌతాయి. అదే మనకు ముక్తిని కరతలామలకం చేస్తుంది. స్వస్తి.

మొదటి అధ్యాయం సంపూర్ణం

